# గతుకులదారి

టేకుమళ్ల కామేశ్వరరావు

తహసిల్దారయిన రామమూర్తిగారు పని నుంచి విరమించుకొని నాలుగేళ్లయింది. ఆయన రాజమహేంద్రవరంలో దానవాయిపేటలో స్థలం కొనుక్కొని, సంసారపక్షంగా ఇల్లు కట్టుకొని, 'రామ, కృష్ణ' అనుకొంటూ కాలక్షేపం చేస్తున్నాడు. పింఛనీ పుచ్చుకొన్నప్పటికీ సంసారబాధ్యతలు తప్పవు. ఆయన నాలుగో కొడుకు పాపారావు మొన్ననే ఇంటర్‌లో ఉత్తీర్ణుడయి, ఆర్ట్సుకాలేజీలో బి. ఏ. లో చేరాడు. అతని చదువు, అతని వివాహాదికార్యాలు తండ్రి చెయ్యవలసిందే కదా! దీనికి తోడు మరొక పిల్ల ఎదిగి, పెళ్లికి సిద్ధంగా ఉంది. అందుచేత రామమూర్తిగారి బాధ్యతలు ఎప్పటిలాగే ఉన్నాయి. పింఛనీ పుచ్చుకొన్నా ఖర్చులేమీ తగ్గినట్లు కనబడవు. పెద్దకొడుకులు ముగ్గురూ ఉద్యోగాలలో ఉన్నమాట నిజమే కాని, పెద్దవాడి మాట అటుంచి, తక్కిన ఇద్దరూ,-ఒకడు చెన్నపట్టణంలోను, ఒకడు బొంబాయిలోను పనిచేస్తూ - డబ్బు చాలక ఇంటినుంచి తెప్పించుకొంటూ ఉంటారు. ఆర్థికసమస్య ఎడతెగని సమస్య. అది ఆయన ఉద్యోగం చేస్తూన్నప్పుడూ ఉంది, చాలించినప్పుడూ ఉంది. పెద్ద ఉద్యోగస్తుడన్నమాటే గాని ప్రాణానికి ఆర్థికమైన సుఖ మెప్పుడూ లేదు.

రామమూర్తిగారు కొడుకులకి పెద్ద కట్నాలు పుచ్చుకొని పెళ్లిళ్లు చేశాడు. ముగ్గురు కూతుళ్లకి పెద్ద కట్నాలు ఇచ్చే పెళ్లిళ్లు చేశాడు. దానివల్ల మిగిలింది లేదు, కూతుళ్ల పెళ్లిళ్లకి ఇంకా కాస్త తగిలింది కాని.

పాపారావుపెళ్లికట్నం కలిసి వచ్చేది కాదు. ఎందుచేతంటే, ఆఖరికూతురు పెళ్లికి సిద్ధంగా ఉంది. అక్కడ పుచ్చుకోడం, ఇక్కడ సమర్పించడం కాగా, పైగా చేతిది పడకపోతే, దైవం రక్షించినట్టు. అటు కొడుక్కి, అంటే పాపారావుకి, ఇటు కూతురికి కూడ సంబంధాలు వస్తున్నాయి. రెండు పెళ్లిళ్లు ఒక్కసారి జరిపితే మంచిదని ఎవరో అనగా, ఇల్లాలుమూతి మూరెడు చేసింది. ఆర్థిక కష్టసుఖాలు ఆడదాని కేమి తెలుస్తాయి! రామమూర్తిగారుమట్టుకు మాట్లాడకుండా ఊరుకొన్నాడు. ప్రస్తుతం డబ్బుఎద్దడిరోజులలో ఇద్దరికీ ఒక్కమాటు చెయ్యడం కొంత మంచిదే అని ఆయనికి తోచినమాట నిజమే! కాని ఇంటిలో సంగతి ఏమిటి? ఆవిడ ఒప్పుదల లేందీ ఏపనీ అవదు. తాతాచార్ల ముద్ర! ఓ పట్టాన్ని ఆవిడ ఒప్పుకొంటుందా! తహసిల్దారు దర్జా ఆయన కేం తెలుసు, ఆవిడకిగాని!

సంబంధాలు వస్తూన్నప్పటికీ రామమూర్తిగారు పిల్లల పెళ్లిళ్లవిషయంలో అట్టే తొందరపడడం లేదు. పెళ్లిళ్లు కాకపోతాయా, ఎటువచ్చీ ఎక్కడేనా కాస్త కూడబెట్టి ఉంచాలిగాని!

ఆయన పదవినుంచి విరమించినా, మామూళ్లుజనులు ఆయన్ని పింఛనీ పుచ్చుకొన్న మనిషిలాగు గాక వెనుకటి హోదాతోనే చూస్తున్నారు. రాబడి గభీమని ఏటి కాలువ తీసినట్టు తగ్గిపోయిందన్న సంగతి వాళ్ల కేమి తెలుసు! తెలిసినా దానిలో ఉండే కష్టసుఖాలు ఏమి అర్థమవుతాయి! డబ్బుకిజాటువల్ల రామమూర్తిగారు ఏడాదికీ రెండేళ్లు ముసలివాడవుతున్నాడన్న విషయం పైవాళ్లకి అక్కరలేదు సరికదా, ఇంటిలోవాళ్లకి కూడా అక్కరలేదు.

ఇంటిల్లిపాదితో పరిచయమున్న పేరయ్య పాపారావుకి ఒక సంబంధం తీసుకువచ్చాడు. అందులో అతనికి ఏమీ లాభం లేదు. సంబంధం కుదిర్చేడన్న పేరుతప్ప అతనికి మిగిలేదేమీ లేదు. వాళ్లకి ఒకర్తె కూతురు. తండ్రిపోయి ఏడాది గడిచిపోయింది. ఆస్తిపాస్తులు బాగా ఉన్నాయి. తన ఏకసంతానం వివాహం తండ్రి కళ్లారా చూసుకోలేదే అన్నలోపం తప్ప మరేమీ లేదు. లోగిలికూడ ఉంది. కాకినాడలో జగన్నాథపురం కాపరస్థలం. పేరయ్యకి ఈ వైనం నాళంవారి సత్రంలో సావిటిలో ఊరికే కాలక్షేపానికి దొర్లుతూండగా, అక్కడికి అదే పనిమీద వచ్చిన మరొక పెద్దమనిషివల్ల తెలిసింది. దాని విషయమై మరికొందరిని వాకబుచేశాడు. మెప్పుపొందాలని చెప్పి తహసిల్దారుగారికి చెప్పకుండానే జగన్నాథపురం బయలుదేరి వెళ్ళాడు. అతను విన్న విషయాలలో ఏమీ తేడా కనబడలేదు. సంబంధం ఇంచుమించుగా రైటుచేసుకొని చక్కా వచ్చాడు. విషయం సవిస్తరంగా తహసిల్దారుగారి ఇంటిలో చెప్పాడు. గృహిణి చాల సంతోషించింది. అలాంటి సంబంధమే, అంటే, ఒకేఒక కొడుకు, ఆడపడుచులేనా లేకుండా, ఉండే సంబంధం-కూతురికి కూడ దొరికితే ఎంతో బాగుండును అనకొంది. సంబంధంవిషయం తహసిల్దారుగారి నోటీసులోకి వెళ్లింది. ఇంటిలో అందరికీ ఒప్పుదల అయితే ఆయనమట్టుకు వద్దంటాడా! ఇంకా తెలియని విషయాలు ఏమేనా ఉంటే కనుక్కొని రావలసింది అని పేరయ్యని మరొకసారి జగన్నాథపురం పంపాడు. నిలుచున్నపాటున పేరయ్య ప్రయాణం కట్టాడు.

పాపారావు ఎర్రగా సన్నగా ఉంటాడు. పంట్లాము, షర్టు వేసుకొంటాడు. మొహం తేటగా ఉంటుంది. ఆ అందం చాలక సోడకళ్లజోడు ఒకటి తగిలిస్తాడు. అతని

చూపు నేలవైపుకంటె కొంచెం ఆకాశంవైపు ఎత్తి ఉంటుంది. భూమిమీది పదార్థాలు ఏమంత మన్నన పాత్రాలని కాబోలు అతని ఊహ! తెలివితేటలకి లోటు లేదు కాబట్టి పట్టీలు కొట్టకుండా చదువులో నెగ్గుకువస్తున్నాడు. అతని సాంఘికాభిప్రాయాలు సంప్రదాయానికి కొస్త భిన్నంగా ఉంటాయి. ఇంటిలోవారు అందరూ అజ్ఞానులు, పూర్వాచారపరాయణులు అంటాడు. తరుచుగా సంఘసంస్కరణ సభలకి వెళుతూంటాడు. తోటివాళ్లతో సాంఘిక విషయాలనిగురించి చర్చించి, వాదిస్తూంటాడు. తనతో భేదాభిప్రాయమున్న ప్రతివాడిని పట్టి తెలివితక్కువవాడని నిర్ణయించుకొంటాడు.

ఇంటిలో గడబిడ అంతా పాపారావు చూస్తూనే ఉన్నాడు. కాని అతనికి ప్రత్యేకంగా ఏవిషయమూ చెప్పినవారు లేరు. తన్ను చూసి ముసిముసినవ్వులు నవ్వుకొన్నప్పటికీ అట్టే గమనించక, అది ఎప్పటి తీరే అని సరిపెట్టుకొంటున్నాడు. పెళ్లివిషయం అతనిదగ్గిర ఎవరు కదిపినా 'ఉఁ ఉఁ' అంటాడని అతనితో ఎవరూ అసలు ముచ్చటించలేదు. ఇక అతనికి ఏలాగు తెలుస్తుంది! పీటలమీద కూర్చునేవేళప్పుడే చెప్పవచ్చునని కాబోలు వాళ్ల ఊహ!

పేరయ్య తిరిగి వచ్చాడు. కట్నం కానుకలదగ్గిరకూడ ఏమీ తేడా రాలేదు. ఆడపడుచులాంఛనాలుకూడ అడిగినప్రకారమే చెల్లిస్తామన్నారు. తహసిల్దారుగారితో వియ్యమందడం! పైగా ఒక్కర్తే కూతురు! ఎప్పటికైనా ఆ ఆస్తి అత్తవారికి చెందవలసిందే!

కొంచెం గడ్డుసమయం వస్తూందని ఇంటిలో అందరూ ఊహించుకొన్నారు. భోజనాలవేళప్పుడు వంటమనిషియైన సుందరమ్మ వడ్డిస్తూంది. తల్లి నేతిగిన్నె పట్టుకొంది. అందరికీ నెయ్యి వడ్డించి, గిన్నె కిందపెట్టి, సంభాషణ కొస్త అందించింది. తండ్రి దానికి దోహద మిచ్చాడు. పక్కని కూర్చున్న ఒకరిద్దరు చుట్టాలు భళా భళీ అన్నారు. తన పెళ్లిమాటలే అని పాపారావుకిమట్టుకు ఒంటిలో రగులుకుపోతూంది. అంతమందిలో ఏమనడానికీ ధైర్యం చాలడం లేదు.

భోజనాలయి సావిటిలో కూర్చున్నారు. తల్లి ఇంకా భోజనానికి లేవలేదు. వాళ్ల సంభాషణ విందామనుకొంది. ఆవిడ లేవలేదుకదా అని సుందరమ్మకూడ సావిటిలోకి వచ్చింది. పాపారావు చెయ్యి కడుక్కొన్నతర్వాత తిన్నగా తన గదిలోకి వెళ్లిపోయి, మేజాబల్లమీద లాంతరు పెట్టి, ఏదో పుస్తకం తెరిచాడు. అతని దృష్టి భోజనాలదగ్గిర జరిగిన సంభాషణమీదికి పోతూంది పది నిమిషాలయింది. ఇంతటిలో చెల్లెలు వచ్చి "నిన్ను పిలుస్తున్నారురా!" అంది.

"ఎవరు?" అన్నాడు అన్నగారు, ఏమీ సానుభూతి లేకుండా.

సావిటిలో జరుగుతూన్న సంభాషణలో పిలిపించండి అంటే పిలిపించండి అనే తీర్మానమయింది కాని ఫలానామనిషి తీసుకురమ్మంటున్నాడన్న నైనం తేలలేదు. ఈ తంతు పూర్తికాకుండానే చెల్లెలు చక్కా వచ్చింది. అందుచేత అన్నగారి ప్రశ్నకు జవాబు చెప్పలేక తడుముకొంటూ ఆఖరికి "అందరూ" అంది.

పాపారావుకి చిరాకులోనే నవ్వు వచ్చింది. కాని ఆగిపోయింది. అతను లేచి పైమీద ఖద్దరుతువ్వాలు వేసుకొని వచ్చాడు.

అతను తనంతట తానే వచ్చినట్లుగా తండ్రి ఊహించుకొని సంతోషించాడు. అంత సుళువుగా అతను రావడం అందరూ శుభసూచకంగా భావించారు. జరిగిన విషయమంతా తల్లికిమాత్రం తెలుసు.

రామమూర్తిగారు కొడుకుని కూర్చోమన్నాడు.

తండ్రిదగ్గిరున్న చేతుల కర్ర కుర్చీ ఒకటి దూరంగా లాగుకొని కొడుకు కూర్చున్నాడు.

"అబ్బాయీ! సంబంధంసంగతి వినే ఉంటావు" అన్నాడు ముసలాయన.

"ఎవరికి?" అని ప్రశ్నించాడు కొడుకు పెంకితనంగా.

పక్కనున్న బంధువొకాయన "నీ విషయమేనోయ్!" అని స్పష్టపరిచాడు.

పాపారావు ఒంటిలో చుర్రుమంది. కాని తండ్రి భయంవల్ల తమాయించుకొని "ఓహో! నాకు తెలియదులెండి!" అన్నాడు, ఠీవిగా బుర్ర పెట్టి, కనుబొమ్మలు ఎగరవేస్తూ.

అక్కడే ఉన్న పేరయ్య కథ అందుకొన్నాడు. పెళ్లికూతురిని కళ్లకి కనపరిచినట్లు, చవులూరేటట్లు వర్ణించివేశాడు.

పాపారావుగుండె రాంఘోలులాగు కొడుతూంది. కోపంతో తల తిరిగిపోతూంది.

మధ్యమధ్య రామమూర్తిగారు, ఆయన భార్యకూడ పేరయ్య మాటలకి అనుగుణంగా ఏవేవో ముక్కలు పడవేస్తున్నారు.

పాపారావు తాను చెప్పదలుచుకొన్న మాటలు గొంతుకదాకా వచ్చి వెనక్కి వెళ్లిపోతున్నాయి. అతను కోపం పట్టలేకపోతున్నాడు.

తండ్రి స్పష్టంగా "అబ్బాయీ! ఇది నీకు చాలా అనుకూలమైన సంబంధం. పిల్ల చాలా యోగ్యమైనది. ఇప్పటివరకు వచ్చిన సంబంధాలలో ఇటువంటిది లేనే లేదు. కాబట్టి చక్కగా ఆలోచించు" అన్నాడు.

"ఆమాట నిజమే!" అంది తల్లి.

పాపారావుకి అటువంటి సంభాషణమీదే కోపంగా ఉంది. ఆ సంబంధం తెచ్చిన పేరయ్యని మింగివేద్దామని చూస్తున్నాడు. అంతేకాని తల్లిదండ్రుల మీద కోపపడడం లేదు.

"ఈసంబంధం చేసుకొంటే నేను కళ్లార చూస్తాను. ఇహ నేను చేసే కార్యకరాదులు ఇంత ముఖ్యమైనవి ఏమి ఉన్నాయని!" అన్నాడు తండ్రి; కూతుళ్ల కంటె కొడుకులు ముఖ్యమనే ధోరణిలో.

"కడసారిబిడ్డడు. ఇహ నేమున్నాయి!" అని తల్లి. అతనితర్వాత గతించిన పసిగుడ్ల నిద్దరిని తలుచుకొని కనుకొలుకులు ఒత్తుకొంది.

పాపారావుమనస్సు తిప్పడానికి ఇదే మంచి అదనని పేరయ్య "దాని కేమి అభ్యంతరం. ఏక్షణంలో పడితే ఆక్షణంలోనే చేసెయ్యవచ్చు" అన్నాడు. చిటికెలు వేస్తూ.

పేరయ్యమీదికి, పెద్దపులి ఎద్దుమీదికి దూకినట్టుగా దూకుదామనుకొంటున్నాడు పాపారావు.

పాపారావుస్వభావం పేరయ్యకు బాగా తెలుసు. తలిదండ్రులు దగ్గిర ఉండబట్టి తనమీదికి లేవడంలేదు కాని లేకపోతే మీదపడి తినేసేవాడే అనుకొన్నాడు. వాళ్ళ ఆసరా చూసుకొని అనవలసిన మాటలన్నీ ఏకరువు పెట్టదలుచుకొన్నాడు.

"నాయనా! నువ్వు ఒప్పుకోక తప్పదు" అన్నాడు తండ్రి, మనస్సు కరిగేటట్లా.

తల్లి బలపరచపోతూండగా పాపారావు మొదటిసారి నోరు విప్పాడు. "నాకు అక్కరలేదు" అనే మాటలని బాంబుని దొర్లించినట్టు ఇవతలకి దొర్లించాడు.

అంతా నిశ్శబ్దమయింది.

తండ్రికి నోరాడలేదు.

తల్లి "ఆలాగు అనకూడదు నాయనా" పెద్దవాళ్లమాటకి ఎదురు చెప్పకూడదురా!! అంది.

పేరయ్య అందుకొని "ఇహ తప్పదు చేసెయ్యడం! ఇప్పటికే అప్పుడే ఆలస్య

మయి పోయింది! ఇంకా ఎంత కాలమని ఊరుకోడం!" అన్నాడు.

"నాకక్కరలేదంటే!" అని పాపారావు పేరయ్యవైపు ఉరిమిచూశాడు.

"ఎందుచేతరా? ఎప్పటికైనా చేసుకోవలసిందే కాదుట్రా! నేనుకూడా చూస్తానురా! ఇహ ఎంతకాల ముంటాను నేను మట్టుకు! నేను రోజులు లెక్కపెట్టుకుంటున్నాను. కడసారిబిడ్డడిపెళ్లి కళ్ళతో చూసి మరీ చాలించడ మవుతుంది. నాకు బాధ్యతలా ఇంక ఉండవు!" అన్నాడు తండ్రి దీనంగా.

కాని పాపారావు తండ్రిమాటలకి ఎదురు చెప్పుతున్నానని అనుకోడం లేదు. తన మనస్సు చెప్పేమాటలని విశదపరుస్తున్నా ననుకొంటున్నాడు.

"నాకు అక్కరలేదు. చదువు పూర్తి అయేకగాని చేసుకోను" అన్నాడు. అది ఎప్పటివాదమే!

"పెళ్లిఅయితేమట్టుకు చదువుకోకూడదా ఏమిటి. అయినవంటనే కాపరానికి వచ్చి కూర్చుంటుందా ఏమిటి!" అన్నాడు పేరయ్య. ఆశ ఇంకా బాధించగా.

అతికోపంచేత పాపారావునోట మాట రాలేదు.

జవాబు చెప్పకపోగా, వ్యర్థమైన ఆశలనుకొంటూ తండ్రికూడా ప్రశ్నించాడు.

"నేను చేసుకోను, నన్ను అడిగవద్దు" అని కోపంచేత వణుకుతూన్న కంఠస్వరంతో పాపారావు అని, చివాలున లేచి వెళ్లిపోయాడు.

"ఈకాలపువాళ్లతో వచ్చిన అల్లరే ఇది! వాళ్లకి తెలియదు, పెద్దవాళ్లు చెప్తే వినరు! ఇది తెలిసిన వయస్సూ కాదు, తెలియని వయస్సూ కాదు!" అని తహసిల్దారు తనని నాలుగు తిట్టుకొన్నాడు.

తల్లి విచారించింది. "ఈకాలపు కుర్రవాళ్లకి లేనిపోని స్వతంత్రం "పెద్దలయెడ ధిక్కారం అన్నాడు పేరయ్య ఉండబట్టలేక.

"వట్టి మోటమనిషి. పెద్దవాళ్లని ముదలకించకూడదని ఎరగడు" అంది తల్లి కోపంతో

"ఈతరంవాళ్లు, తమ మేలూ ఎరగరు. ఒకళ్ల మేలూ ఎరగరు" అని విచారించాడు తహసిల్దారు.

"అనుభవిస్తాడులెండి!" అని పేరయ్య గొణుక్కొని ఇంకా ఆశ వదలక కూర్చున్నాడు. తాను ఎంతో ఆశపడ్డపేరు పోయినందుకు ఒకవైపు విచారిస్తున్నాడు. లాభం లేదని మిగతావాళ్లకి బోధపడి అవస్థపడుతున్నారు.

తహసిల్దారుగారింటిలో పనిచేస్తూన్న సుందరమ్మకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురున్నూ. కూతురిపేరు పార్వతమ్మ. ఆ అమ్మాయికి చిన్నతనంలోనే, అనగా తొమ్మిదోయేటే, పెళ్లి చెయ్యగా మరుచటి సంవత్సరమే ఆ కుర్ర భర్తకాస్తా గతించాడు. పాపం ఆపిల్ల ఇల్లుపట్టింది! ఆ అమ్మాయికి ఇప్పుడు పదహారోఏడు. నవీనసంప్రదాయంప్రకారం ఆమెకి నుదుట ఒక్క కుంకుమ తక్కువకాని మరేమీ లోటులేదు. భర్త గతించేక, బతుక్కి రెక్కలే ఆధారం కదా అని ఆమెతల్లి కొంత చదువు చెప్పించింది. హైస్కూలులో నాలుగోఫారం పూర్తి కాగానే ముఖ్యంగా వ్యక్తురాలయిందన్న కారణంచేత, చదువుకొని ఉద్యోగం చెయ్యాలా ఊళ్లేలాలా అని చదువుమానిపించింది తల్లి. సుందరమ్మ తన అనుభవంలో ఉద్యోగంవల్ల చాలా బాధలున్నాయని చెప్పి ఆపిల్లకి ఉద్యోగచదువుపొంతకీ, ఉద్యోగాలపొంతకీ పోనియ్య లేదు. ఎప్పటికేనా ఇప్పడు తల్లి చేతులో ఉన్న నౌఖరీయే గతి. ప్రస్తుతం ఆపిల్లకి ఇంటి పనులతోనే తీరిక ఉండదు. ఎప్పుడేనా కాలక్షేపానికి ఆ అమ్మాయి తన తల్లితో కూడ తహసిల్దారు గారింటికి వస్తూంటుంది. పైగా వాళ్ల ఇల్లు దగ్గర కాదు. తహసిల్దారు గారిల్లు దానవాయిపేటలో ఉండగా, ఆమె ఇల్లుమార్కండేశ్వరస్వామిగుడిదగ్గిర ఉంది. ఎప్పుడేనా జరూరుపని చెయ్యవలసి వచ్చినా, లేక భారమైనవులు తటస్థించినా, సుందరమ్మే తన బిడ్డని సాయం తీసుకొని వస్తూంటుంది. ఆ పిల్ల పసితనంలో వస్తూన్నంత చొరవగా ఇప్పుడు రావడంలేదు వాళ్లది సత్సంప్రదాయం. భాగ్యభోగ్యాలమాట ఎట్లా ఉన్నా, మర్యాదగల కుటుంబం. అందుచేత తహసిల్దారుగారుకూడా చాలా గౌరవంతో చూస్తుంటాడు. పార్వతమ్మని చిన్నతనం నుంచీ పాపారావు ఎరుగును.

ఒకరోజున సుందరమ్మ పార్వతమ్మని పనికి సాయంకోసమని తహసిల్దారుగారింటికి తీసుకొనివచ్చింది. పాపారావు గదిలో వున్న కాగితపుబుట్టతో అవసరం వచ్చింది. తహసిల్దారుగారి భార్య, పాపారావు ఇంటిలో లేడనే ఉద్దేశంతో, పార్వతమ్మని ఆగదిలోకి వెళ్లి బుట్టతీసుకరమ్మని పంపించింది. పార్వతమ్మ వెళ్లింది.

పాపారావు కుర్చీమీద కూర్చుని దీక్షగా చదువుకొంటున్నాడు. ఎవరూ లేరనే ఉద్దేశంతో పార్వతమ్మ చొరవగా గదిలోకి వెళ్లింది. లోపలికి వెళ్లి అటుఇటు చూడగా పాపారావు కనబడ్డాడు. ఆ అమ్మాయి తిరిగి వెళ్లిపోబోయింది. కాని అతను "ఏమిటి పని?" అని అడిగాడు.

వున్నసంగతి స్పష్టంగా చెప్పితే మంచిది. లేకపోతే ఏమి అనుమానపడతాడోఅని ఆఅమ్మాయి "ఇక్కడ కాగితపు బుట్ట ఉందిట! మీ అమ్మగారు తెమ్మన్నారు" అంది.

ఆవస్తువు మంచంకింద ఉంది, అందుచేత అతను మంచంకిందికి దూరి తీసుకువచ్చి, పార్వతమ్మ చేతికి ఇయ్యబోతూ, ఆమె మొహం వైపు ఉట్టినే జంకుతూ చూశాడు. బేడిసాలలాంటి మెకళ్లు అతనిదృష్టినినిలబెట్టేశాయి. పాపారావు తన్ను మరిచి చూశాడు. పార్వతమ్మసిగ్గుపడి మొహంవంచుకొని,పమిటకొంగు దగ్గిరికి లాగుకొని,నిలబడింది.అతను జ్ఞానం తెచ్చుకొని, చటాలున కాగితపుబుట్ట ఆమెచేతికి అందిచ్చాడు. ఆమె ముంజేతిని చూస్తూ నిలబడిపోయాడు. కాని తన చూపుకి ఆమె ఏమనుకొంటుందో, ఎవరితో చెప్పతుందో ఏమిటో అని భయపడిపోయాడు.ఆ అమ్మాయివెళిపోయింది. అతనుగదిలో ఉన్నాడన్నసంగతి ఆమెఎవరికీచెప్పలేదు.

పాపారావుధ్యానం ఆ అమ్మాయి మీదే ఉంది. అతను మనస్సంతా చదువుమీద కేంద్రీకరించాలని ఎంతో ప్రయత్నం చేస్తున్నాడు. కాని ఒక్కక్షణం పుస్తకంమీద ఉంటూ, అతనికి తెలియకుండానే జారిపోతూంది. మళ్లీ తెలివి తెచ్చుకొని మళ్లీ పుస్తకంవైపు చూస్తూన్నాడు. మళ్లీ మనస్సు జారిపోతూంది. ఇట్లా మనస్సుతో గుంపిసెంపీలు బడుతున్నాడు. చివరికి పుస్తకం కింద పెట్టివేసి 'ఇదేమిటా!' అని ఆలోచించడం మొదలుపెట్టాడు. పార్వతమ్మ అతని మనస్సులో పీఠం వేసుకు కూర్చుంది. "ఇంత కాలంనుంచీ ఆ అమ్మాయి ఇంటికి వచ్చి




జేబుగడియారం

స్విస్‌తయారు. రైల్వే టైం కీపర్. షాక్ ప్రూఫ్. ప్రత్యేకముగా పరీక్షింపబడినవి. 10 సంవత్సరములు గ్యారంటీ.

సుపీరియర్ క్వాలిటీ రూ 10-8-0

సుపీరియర్ రేడియం రూ 12-8-0

ఒలింపిక్ పెన్

ఒక్కొకటి రూ 1-8-0. సుపీరియర్ రూ 2-8-0

FREE INDIA WATCH Co.

Post Bag No. 6724, Calcutta 7.

పోతున్నా నేను అంత జాగ్రత్తగా చూడలేదు. ఇంత అందకత్తా! ఏమిటో అనుకొన్నాను. ఈ సినీమాస్టారులు వట్టి వేషధారులు. సహజమైన అందం లేనిదీ వేషం వట్టి డాంబికం. అబ్బా!" అనుకొన్నాడు. ఆమెయొక్క అందమైన నేత్రాలు, చక్కని తలకట్టు, కోమలమైన కంఠం, తామరతూడులాంటి ముంజేయి అతని మనస్సులో ప్రదేపదే కనబడుతున్నాయి. అతను చదువు చాలించి పరుపు విప్పుకొని ముసుగు తన్ని నిద్రపోయాడు.' తీయని కలలు కన్నాడు.

పార్వతమ్మ మళ్లీ తహసిల్దారుగారింటికి రాలేదు. ఆ అమ్మాయి వస్తుందని పాపారావు ఎంతో ఉత్కంఠంతో ఎదురుచూస్తున్నాడు. కాని ఆ పిల్లదర్శనం అవటంలేదు. అందుచేత అతను ఒకమాటు ఆమె ఇంటివైపు వెళదామనుకొన్నాడు. కాని తాను గొప్ప ఉద్యోగస్తుడి బిడ్డడై ఉండి వంటమనిషి ఇంటివైపు వెళతాడా! అందుచేత ఆ అమ్మాయి తన ఇంటికి రావడం కోసమే కనిపెట్టుకొని చూస్తున్నాడు.

తల్లి ఏదో పనిమీద పంపించగా పార్వతమ్మ తహసిల్దారుగారింటి గుమ్మందగ్గిరికి వచ్చింది. ఆమె డైమానుసిల్కు సగ్గుబియ్యం చీర కట్టుకొంది. తలదువ్వుకొని బర్మాముడి వేసుకొంది. తలకట్టు నిగనిగలాడుతూంది. క్రీగంటిచూపులూ, బెదరులేడిచూపులూ చూస్తూ ఆమె వస్తూంది. ఇంటికి రావడం పాపారావుకంటబడింది. అతను చెదరిపోతూన్న మనస్సును నిలబెట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ఊరికే తరంగాలలాగు వస్తూన్న ఉత్సాహంతో కుస్తీ పట్టుపడుతున్నాడు.

పార్వతమ్మ కిందటిమాటు ఘటన తలపోసి తడబడుతూ మెట్లెక్కింది. పాపారావు ఎగురవగా ఆమె పెదిమెలని చిరునవ్వు చుట్టివేసింది. ఎంత ఆపుకొందామన్నా ఆగకపోగా సిగ్గుపడి తల వంచుకొంది. గుండె తిరగబడి కొట్టింది. రవ్వంత భయం వేసి పాపారావు మొహంవైపు కొస్త పరీక్షగా చూసింది. పాపారావు చూపులతో ఆమెశరీరాన్ని గిలిగింతలు పెడుతున్నాడు. ఆమెకి ఎంతో సిగ్గనిపించింది. తల ఎత్తుకోలేకపోయింది. నడవడానికి కాళ్లు కదలలేదు. చిట్టచివరకి మనస్సుని సమాళించుకొని ఇంటిలోకి వెళ్లింది. ఆమెకి ఈ విపరీత మేమీ అర్థం కాలేదు. "ఏమిటిది? దీని పేరేమిటి?" అనుకొంది. తల్లి చెప్పమన్న విషయం తహసిల్దారుగారి భార్యకి చెప్పి ఆమె తిరిగి ఇంటికి చరచరా వెళ్లిపోయింది.

ఇంటికి వెళ్లినతర్వాత పార్వతమ్మ జరిగిన ఘటనంతా పర్యాలోకించుకొంది. "ఇదంతా ఏమిటి? నావైపు ఆ యువకుడు ఆమోస్తరుగా ఆవేశంతో చూడడమెందుకు? నే నేమి సమాధాన మిచ్చానని? నా కెంతో సిగ్గువేసింది అతను అలాగు చూస్తుంటే. ప్రేమ అంటారు, ఇదే కాబోలు! నాకు లేని ప్రేమ తన కెందుకు? నేను అడ్డువచ్చి గట్టిగా కేకలు వేశానంటే అతని పని ఏమవుతుంది! ఇది పెద్దవాళ్లదాకా తీసుకుపోతేనో?...మన కెందుకు పోనీ అని ఊరుకొంటేనో?..... దానిలో ఏమి సుఖానుభవాలున్నాయో, ఏమిటో!" ఈ ఆలోచన తలపుకి రాగానే ఆమె మనస్సు ఉత్తేజం పొందింది. "నేను చూసీ చూడనట్టుగా ఊరుకోనా?" ఇంతటిలో మనస్సు "ఏమి పని చేస్తున్నావే పార్వతీ?" అని ప్రశ్నించినట్లయింది. "నేను తలచగూడని విషయాలు తలపోస్తున్నాను కాబోలు! దీనిలో ఎంత ప్రమాదముందో ఏమిటో! నా కంటికే కనపడుతున్నాయి కొన్నికొన్ని! ఇదివరకు ఇటువంటి పనులు చేసినవాళ్లని బట్టేనా కొంత ఊహించుకోవచ్చు. మా కుటుంబగౌరవం! ఎదుటివాళ్ల కుటుంబ గౌరవం! ఇటువంటి పనులు కొంపలోవాళ్లు హర్షిస్తారా? పెద్దవాళ్లకి చెప్పి చేద్దామంటే వాళ్లు ఒప్పుకొంటారా? చాటుగుండా అభివృద్ధిపొంది చావవలసిందే కదా? పైగా, వాడికి తెలియకపోతే ఇన్నేళ్లు వీపుమీదికి వచ్చి నీకు తెలియదా అని దుయ్యబట్టుకొంటారు నలుగురూను! ఎవళ్లు పెద్ద ఎవళ్లుచిన్న అన్నదికూడా గమనించరు. ఒకమారు పెళ్లి అయిం దనిపించుకొన్న కర్మఫలమా ఇది? కనుక ఈ విషయాలలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి పొరపాటున కాలు జారిందంటే ఘోరప్రమాదాలు జరుగవచ్చు!" అని అనుకొన్నది. "అయినా కంటికి కనబడుతూన్న విస్తృత సౌఖ్యలోకాన్ని వదులుకోగలనా?" అని మళ్లా తలపోసింది. ఆమె మథన పడుతూంది కాని స్థిరాభిప్రాయానికి రాలేకపోయింది. కొత్తగా వచ్చిన పరిస్థితులకి, గ్రహపాటుకి విచారించింది. ఆమెకి ఏమీ పాలుపోలేదు.

పార్వతమ్మ ఈమధ్య తహసిల్దారుగారింటికి పోనేలేదు. ఆమె రాకపోగా పాపారావుమనస్సు తహతహలాడిపోతోంది. అతని దృష్టి ఏ పనిమీదా నిలకడగా ఉండడం లేదు. ఏదో ఒక పని మొదలుపెడతాడు. అది కాగు ఇదంటాడు; ఇది కాదు అదంటాడు! పార్వతమ్మ ఇంటివైపు వెళదామని కోరిక పుట్టగా అతని బుద్ధి అడ్డు తగిలింది. కాని అతను గోదావరిగట్టుమీద ఉన్న ఆమె ఇంటివైపు వెళ్లి ఎక్కడో దూరాన్ని నిలుచుని చూడదలచాడు. అతను బయలుదేరివెళ్లి గోదావరిగట్టు మీద దూరంగా నిలుచుని, పార్వతమ్మ ఇంటిలోంచి ఇవతలకి వచ్చి వెళ్లడం చూసి చాలా ఆనందపడ్డాడు. తనని చూసే ఆ అమ్మాయి బయటికి వచ్చిందని నిర్ణయించుకొన్నాడు. ఆమెమనస్సంతా తనమీదే ఉందని భావించుకొన్నాడు.

మధ్యమధ్య చిన్నచిన్న అవసరాలు కలిగినప్పుడు సుందరమ్మ తన కుమార్తెని తహసిల్దారుగారింటికి వెళ్లి రమ్మంటూంది. కాని ఆపిల్ల మొండితనంచేసి ఊరుకొంటూంది. ఈమోస్తరుగా ఆ అమ్మాయిదర్శనం అరుదు కాగా పాపారావుమనస్సువికలమై పోయింది. అతనే ఆమె ఇంటివైపు అప్పుడప్పుడు వెళుతూండేవాడు. ఆమె దారిలో ఒకటి రెండుసార్లు తారసిల్లగా, ఎంతో ఆప్యాయంగా సంభాషించడం మొదలుపెట్టాడు. కాని అతను ఊహించినంత ఉత్సాహంగా ఆమె బిడ్డమాట్లాడేది కాదు.

[ఇంకావుంది[

ఖగోళశాస్త్రజ్ఞు డొకాయన ఉపన్యాసం దంచేస్తున్నాడు.

"మరొక పదమూడుకోట్ల ఏళ్ళలో భూగోళంయావత్తూ నామరూపాలు లేకుండాపోతుందని నేను జోస్యం చెబుతున్నాను."

"ఎన్నేళ్లు ?" అని సభలోనుండి ఒక భయపడిన గొంతుక.

"పదమూడు కోట్ల ఏళ్ళలో."

ప్రశ్నవేసిన మనిషికి భయం తగ్గింది. "ఓ! పదమూడు కోట్లఏళ్ళా? మూడు కోట్ల ఏళ్ళేమోననుకున్నా!"

# గతుకులదారి

టేకుమళ్ళ కామేశ్వరరావు

## 2

ఆ సమయంలో సుందరమ్మ తహసిల్దారు గారింటిలో పనిచేస్తూంది. పాపారావు పార్వతమ్మ ఇంటికి బయలుదేరి వెళ్లాడు. పార్వతమ్మ అతన్ని చూసి ఆశ్చర్యపోయింది. "ఇంత ధైర్యంచేసి వచ్చేడా! ఇది ఎవరైనా చూస్తే ఎంత ప్రమాదమో!" అనుకొంది. వచ్చిన పెద్దమనిషిని కుర్చీమీద కూర్చోమంది. అతను కూర్చున్నాడు. అతిథుల మొహాన్ని ఇన్ని కాఫీ నీళ్లు కాచి పొయ్యడం ఈ కాలపు ఆచారంకదా అని ఆమె కుంపటిమీద నీళ్లుపెట్టి, విసురుతూంది. పార్వతమ్మ నవమోహనంగా కనపడింది. ఆమె పక్కగా కూర్చుండగా, వీపుమీద తెల్లని పమిటిలోంచి వాలుజడ కనబడుతూ, చీరె నల్లని అంచుతో జడకొస చెలగాట లాడుతూండగా, తేటనీటి కాలువలో ఈదుతూన్న నల్లతాచుపాములాగుందని అతను భావించుకొన్నాడు. అతను కళ్ళజోడు తీసి చేతిరుమాలుతో శుభ్రపరిచి మళ్ళీ పెట్టుకొన్నాడు. ఆమె చేస్తున్న ప్రతిపనీ అతనికి ముద్దుగా కనపడగా వింతగా పరిశీలిస్తున్నాడు. అందమైన ఆమె మొహం కళ్లకి మిరిమిట్లుగొల్పుతూంది. సంభాషణ ఎట్లా మొదలుపెట్టడమో అతనికి తోచ లేదు. పార్వతమ్మకి సిగ్గనిపించి మోకాలిమీద గడ్డమాన్చి కూర్చుంది. కొంత సేపటివరకు ఏ ఆలోచనా తోచ లేదు. చివరికి ఆమె "కులాసాగా ఉంటున్నారోయ్!" అని కుశలప్రశ్న వేసింది. చిరునవ్వు ఆమె పెదిమలని చుట్టివేయగా ఆమె పెదిములు బిగబట్టింది.

"ఎక్కడ ఖులాసా! నీకు తెలియనిదేముంది" అని అతను ఆమె పెదవులపైపు చూశాడు.

"నాకు తెలిసిం దేమిటి?" అని ఆమె ప్రశ్నించింది.

"నా మనస్సుని నీ వెరుగవా?" అంటూ అతను ఆమె చక్కని చెవులపైపు, మెరుస్తూన్న దుద్దులపైపు చిత్రంగా చూశాడు.

"నువ్వు వర్ణించి చెప్పేవా ఎప్పుడైనా" అంది ఆమె.

"నీ మనస్సుని నే నెరిగినట్టే నా మనస్సును నువ్వు ఎరుగవా?" అంటూ అర్ధచంద్రుడిలాంటి నుదుటిపైపు కోరికతో చూశాడు.

"ప్రశ్నని మరీ చిక్కుపరుస్తున్నావు. నా మనస్సు నాకు తెలుసు గాని నీ కేం తెలుసు? పైగా నీ మనస్సుని నే నే మెరుగుదును?" అంది. ఆమె మాట్లాడుతూండగా ముత్యాల కోవలాంటి పలువరసపైపు అతను ప్రియంగా చూశాడు.

"పార్వతీ! కప్పిపుచ్చకు, దాచకు. మన మనస్సులు ఐక్యమైనట్టే——" అని అంటూండగా ఆమె అడ్డువచ్చి "ఎప్పుడూ అటువంటి వ్యర్థమైన ఆలోచనలకి పోకు! నీకు నీ మనస్సు తెలుసు కాని ఎదుటవాళ్ల మనస్సేమి తెలుస్తుంది? నా మనస్సు నీ కేమీ తెలియదని నీ మాటలవల్ల నాకు రుజువవుతూంది" అంది కొంచెం చురుకుగా.

"అలాగు కఠినంగా మాట్లాడకు పార్వతీ!" అని ప్రార్థిస్తూన్నట్లుగా చూశాడు.

"అబ్బాయీ! నీ తాహతు ఎరగకుండా మాట్లాడుతున్నావు! నువ్వు చేసేపనిలో ఉండే మంచి చెడ్డలు నీకు తెలియడం లేదు. నీ రహస్యభావాలు మీవాళ్లకి తెలిస్తే హర్షిస్తారా?" అంది.

"వాళ్ల గోల మన కెందుకు, అమ్మాయీ!' అని నిగనిగలాడుతూ బంగారపు బిళ్లలల గున్న ఆమె చెక్కిళ్లపైపు చూశాడు.

"మనకంటె వాళ్లు జ్ఞానసంపన్నులు. మానవప్రకృతిలో లోప మేదేనా ఉంటే ఉండవచ్చు! అంతమాత్రంచేత వాళ్ల జ్ఞానాన్ని, బుద్ధిని గురించి పొరపడ కూడదు' అంది.

ఆమె సంభాషణ తృప్తిగా లేవందుకు పాపారావు విచారించాడు. "మన వివాహానికి ఏదో ఒకమార్గం చూపించు" అని అతను ఆదుర్దా తెలియబరిచాడు.

"తప్పు! తప్పు! అటువంటిమాట ఇకముందెప్పుడూ అనవద్దు" అని మృదువుగా మందలించింది.

ఆ మందలింపును మింగివేసి అతను "కాదు, పార్వతీ!" అంటూండగా, ఆమె "అటువంటి వ్యర్థపు టాలోచనలకి పోవద్దు" అని కొంచెం కరుకుగా అంది.

ఆమె అతనిచేతికి కాఫీకప్పు అందిస్తూండగా ఆమెచేతులు వణికాయి. కాఫీ తొణికి అతని పాదాలమీద పడింది. ఆమె కంగారు పడింది. కప్పు అందుకొంటూ పాపారావు, బంగారుతొడుగులు ధరించినట్లున్న ఆమె ముంజేతులపైపు చూసి మైమరిచాడు. కప్పు చేతితో పట్టుకొని "ఈ దీనుడికి దారి చూపించు. నీ మనస్సు నా దగ్గర మభ్యపరచకు. నా మనస్సు ఎంత ఆందోళన పడుతోందో, నీ మనస్సూ అంతే ఆందోళన పడుతూందన్న విషయం నీ తొట్రుపాటే తెలియజేస్తూంది. అది మానవస్వభావం!" అన్నాడు పాపారావు.

ఆమె, తెర మరుగునఉన్న తన మనస్సు యొక్క యథాస్థితిని అతను సరిగా వర్ణించినట్టుగా గ్రహించి విచిత్రపడి ఒక్క క్షణం ఊరుకొంది.

పాపారావు దీనంగా చూశాడు. అతని చూపులని ఆదరించాలో, తృణీకరించాలో, కోపించాలో ఆమెకి తోచలేదు. మనస్సు పరిపరివిధాల పోయింది.

పాపారావు వచ్చి చాలా సేపయింది. ఎవరేనా రావచ్చు, చూడవచ్చు అని ఆమె భయపడి "ఇక నువ్వు ఇక్కడ ఉండవద్దు. మన సమావేశం మన ప్రాణం మీదికి రావచ్చు. నువ్వు బయలుదేరి వెళ్లు. అంది. కాని అతను లేవలేదు. ఇంక తాను చెయ్యి చేసుకొంటేనే గాని లాభం లేదని తలచి, అతని చెయ్యిపట్టుకొని కుర్చీమీంచి లేవదీసింది. ఆమెచెయ్యి తగలగానే అతని ఒంటిలో మెరుపు మెరిసినట్లనిపించింది. అతను లేచి గుమ్మంమెట్లు దిగాడు. గోదావరిగట్టుమీద నడిచి, సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు.

ఎదుట గోదావరి నదీమతల్లి దివ్యంగా ఉంది. సాయంకాలపు వింతప్రభలు నీటిలో ప్రతిఫలించాయి. పొద్దుగుంకుతూందని కాబోలు మొగిలుబిడారాలు ప్రయాణమాపుచేసి తమ సొగసు నీటిలో చూసుకొంటున్నాయి. పక్షులు కంగారుగా ఎగురుతూ పాటలు పాడుతున్నాయి. నదిలోను, గట్టుదగ్గిర, ఉన్న పడవవాళ్లు పనులని ముగించుకోడంకోసం తొందర పడుతున్నారు. నీటిమీంచి వస్తూన్న చల్లగాలి పాపారావుకి ఎంతో సౌఖ్యమనిపించింది. అతను ఆ ఆలోచనలలో పడ్డాడు. "ఆమె మనస్సు నాకేమీ అంతుపట్టడం లేదు. ఒప్పుకొన్నట్టా? మానినట్టా? నా మనస్సు ఇంత కొట్లాడిపోతూండగా ఆమె మనస్సు ఇంత ప్రశాంతంగా ఉండడం ఎంతేనా చిత్రంగా ఉంది. ఆడదానికి తన మనస్సు ఎంత స్వాధీనంలో ఉంటుంది! బహుశః ఆమె ఆలోచన వితంతువివాహం కూడదని కాబోలు! లేకుంటే నా ప్రేమకి ప్రతిభావం కనబరచకుండా ఉంటుందా? అదే కారణమయితే ఆమెకి నచ్చజెప్పడం మొక పెద్ద పనిలోవి కాదు. ఒక క్షణం చాలు! నా మిత్రుణ్ణి నాతో కూడా తీసుకొనివచ్చి వాదించానంటే ఇట్టే లొంగుబాటులోకి వస్తుంది" అనుకొంటూ చిటికెలు వేశాడు. ఆరోజున టౌన్‌హాలులో ఒక సంఘసంస్కరణసభ జరుగుతూంది. ఆ సభకి అతను వెళదామని బయలుదేరాడు. కాని ఇక్కడే చీకటిపడిపోయిందంటూ, ఇంటికి వెళ్ళిపోయాడు.

జరిగిన విషయమంతా పార్వతమ్మ సింహావలోకనం చేసుకొంది. సంభాషణ ప్రారంభంలో తనకున్న చిత్త స్థైర్యం, సంభాషణ ముగిసేముందు లేకపోయినందుకు విచిత్రపడ్డది. దీనిని ప్రేమ అంటారో, కామమంటారో, మరేమంటారో? పైగా నేను చేస్తూన్నది తప్పుపనో, మంచిపనో? దీనినిగురించి ఎవరినేనా అడిగి చూస్తాను. ఎవరినడగను? ఎవరినడిగితే తప్పు పట్టుకొంటారో? కాని నామట్టుకునాకు బోధపడని సంగతులు ఇతరుల నడిగి తెలుసుకోక తప్పదు. నాకు తెలియక, ఇతరుల నడగక, ఏలాగు బతకడం? కాబట్టి తగినవాళ్లని నేర్పుగా అడిగిచూస్తాను. ఇంకా గ్రంథాలలో వెదికి చూస్తాను. అంతేకాని నేనై ఒట్టినే ఊరుకోను!" అని తర్కించుకొంది. దీనికిఆధారం ఏగ్రంథంలో నేనా ఉందేమో అని భాగవతాది పురాణాలు తిరగవేసి చూసింది. కాని ఏపుస్తకం విప్పిచూసినా, ఇంద్రియాలని జయించాలి, రాగ ద్వేషాలని వర్జించాలి, నిష్కామంగా జీవించాలి, మనస్సుని భగవంతుడిమీదే నిలపాలి అనే ఉంది. అంతేకాని తన భావాలని ఎక్కడా మెచ్చుకోడం కనపడలేదు. ఆమె తన చిత్త చాంచల్యానికి విచారించి "తుచ్ఛప్రభావాలు" అనుకొంది. అయినా వీరభద్రపురం వెళ్లి స్త్రీల మఠంలో ఉన్న సాధువమ్మదర్శనం చేసి, అడిగిచూస్తాను. ఏమవుతుందో?" అనుకొంది.

పాపారావు పార్వతమ్మ ఇంటికి చాటుగా మాటుగా వెళ్ళి వస్తూండడం పేరయ్యకంటపడింది. అతను తహసిల్దారుగారి పేర ఆకాశరామన్న ఉత్తరాలు బనాయించాడు. తహసిల్దారుగారు వాటిని చదువుకొని, పైగా మరికొన్ని సంఘటనలని చూసుకొని, ఇది నిజమే అయుండవచ్చని తలచాడు. తల్లిదండ్రులు పాపారావుని తల వాచేటట్లు చీవాట్లు పెట్టారు. మాగడప తొక్కవద్దని పార్వతమ్మని చెప్పు దెబ్బలు కొట్టారు. ఇదా మీ సంప్రదాయమని సుందరమ్మని పడదిట్టారు. ఇదేంపోయే కాలమంటూ సుందరమ్మ పార్వతమ్మ మీద విరుచుకుపడింది. లోకులు ఆడి పోసుకొన్నారు.

పార్వతమ్మ తన చేతినున్న వెండిగాజులు తీసివేసింది. వాలుజడ విప్పి ముడి వేసుకొంది. సన్నని చీరెలు మానివేసి కాషాయ రంగు రవిక. అదే రంగుచీరె కట్టుకొన్నది. మూర్తీభవించిన వైరాగ్య మూర్తిలాగు తయారయింది.

వీధిలో పాపారావు వస్తూంటే పార్వతమ్మ తారసిల్లింది. ఆమె వేషం చూసి అతను నివ్వెరపోయాడు. అతని కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. చేతిరుమాలుతో కళ్లు తుడుచుకొన్నాడు. అతని స్థితి చూసి, సానుభూతిగా ఆమెకళ్లు చెమ్మగిల్లాయి. "ఇదేమిటి ఈవేషం!" అన్నాడు. ఆమె జవాబు చెప్పలేదు. కాని అతను కొంత ఊహించుకొన్నాడు. "ఎక్కడికి వెళుతున్నావు?" అని ప్రశ్నించాడు.

"సాధువమ్మ ఆశ్రమానికి."

"ఎందుకు?"

"అక్కడా నాకు మనశ్శాంతి."


SPLENDID SELECTION
MADE IN FAMOUS SWISS FACTORIES
EACH GTD. FIVE YEARS

NO-81  Size 7¾"
5 JEWELS CHROME 30/- ROLLED GOLD 33/-
7 JEWELS CHROME 35/- SUPERIOR 38/-
15 JEWELS " 44/- ROLLED GOLD 48/-

NO-82  Size 7¾"
5 JEWELS CHROME 28/- ROLLED GOLD 33/-
7 JEWELS CHRME 33/- SUPERIOR 35/-
15 JEWELS " 42/- ROLLED GOLD 45/-

NO-83  Size 12"
FULLY JEWELLED 19/- SUPERIOR 21/-
WITH RADIUM 21/- CENTRE SECOND 23/-
SPECIAL HIGH CLASS MACHINE 27/-

NO 84  Size 8¾"
5 JEWELS CHROME 26/- ROLLED GOLD 32/-
7 JEWELS CHROME 32/- ROLLED GOLD 36/-
15 JEWELS " 48/- ROLLED GOLD 58/-

NO-85  Size 6¾"
5 JEWELS CHROME 22/- SUPERIOR 25/-
5 " ROLLED GOLD 30/- SUPIRIOR 33/-
15 " CHROME - 45/- ROLLED GOLD 55/-
TIME PIECE - 20/- SUPERIOR 25/-
POCKET WATCH 12/- SUPERIOR 15/-
Postage extra. Free on order for two

H. DAVID & CO.
POST BOX NO 11424 CALCUTTA

"నీకేమిటి! ఆశ్రమమేమిటి!" అన్నాడు ఆశ్చర్యంతో.

"అంత ఆశ్చర్య మెందుకు?" అని ఆమె ఆశ్చర్యపోయింది.

"మన ప్రేమకి, ఆశ్రమానికి సంబంధ మేమిటి?"

"నా ప్రేమ ఈశ్వరార్పితం."

"ఆమాట అందరికీ ఉంది."

"నాకాయనే భర్త."

పాపారావు మళ్ళీ నివ్వెరపోయాడు. "వితంతువు వివాహం చేసుకోకూడదని నీ దురభిప్రాయం! ఆసంగతి నాకిదివరకే తెలుసు. దానికి తగిన సమాధానం చెప్పే మనష్యులని తీసుకువస్తాను. నేను చేతకాని వాణ్ణి అనకొన్నావేమో!" అన్నాడు.

ఆమె చిరునవ్వువెన్నెలకి అతని ముఖ కైరవం వికసించింది. "పార్వతీ నన్ను మోసపుచ్చకు" అన్నాడు.

"నేను ఎవరినీ ఆశ పెట్ట లేదు మోస పుచ్చడానికి" అని సమాధానం చెప్పింది.

నడి రోడ్డుమీద అంతకంటే సంభాషణ కుదరక ఎవరిదారిని వాళ్లు వెళ్లిపోయారు.

పాపారావుకి ఆమెవేషం తెలుచుకొన్న కొద్దీ దుఃఖం పొర్లివచ్చింది. "అంత అంద చందాలు గల మనిషి ఈ వికృత వేషం వేసుకోడం! ఇది సంఘంచేసే దారుణాలకి నిదర్శనం. ఆమె వితంతవు అనేక దా సంఘం ఆమె ప్రేమ ప్రకటనని బహిష్క రించడం. ఇటువంటి సంఘాన్ని నేను తృణీ కరించక మానను. నిష్కారణంగా ఆమెని మాతల్లిదండ్రులు ఆడిపోసుకొన్నారు. ఆమె కొంపలోవాళ్లకి కూడా బుద్ధి లేకపో యింది." అని ఎంతో విచారించాడు. తన మిత్రుడైన సీతామనోహరుడి ఇంటికి వెళ్లాడు.

సీతామనోహరుడు దానవాయిపేటలో ఉన్నాడు. అతను పట్టభద్రుడు; ఒక జోళ్లషాపు పెట్టుకొని చక్కగా వ్యాపారం చేసుకొంటున్నాడు. అతను సంఘ సంస్కార ప్రియుడు. వీరేశలింగంగారి తోటలో చేరిన ఒక వితంతువుని పరిణయ మాడాడు. పాపారావుకి, సీతామనోహరుడికి గొప్పస్నేహం ఏర్పడింది. సంఘసంస్కర్త లని మెచ్చుకోడం, అటువంటి సభలకి వెళ్లి వస్తూండడం, సీతామనోహరుడు బల్లగుద్ది ఉపన్యాసాలిస్తూండడం, ఇవే కాకుండా వాళ్ల ఇళ్లు కూడా దగ్గరగా ఉండడం, ఇటు వంటి కారణాలవల్ల వాళ్ల ఇదరికీ మంచి స్నేహం కలిసింది. పాపారావు సీతామనోహ రుడి ఇంటికి వెళ్లాడు. కాని అతను ఇంటి వద్దలేడు. అందుచేత రేపు ప్రొద్దున్న కలుసు కొంటానని చెప్పి తిరిగి వచ్చి వేశాడు.

తహసిల్దారుగారు తన కొడుకుయొక్క దురాలోచనలు చూసి ఈ మాటు కుదిరిన సంబంధం బలవంతంచేసయినా కొడుక్కి కట్టబెట్ట దలుచుకొన్నాడు.

పార్వతమ్మ మునపటికంటె తరుచుగా సాధువమ్మదర్శనం చేస్తూంది.

సాధువమ్మ పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా ఎవ్వరూ ఎరగరు. ఆమె ఆజన్మ బ్రహ్మచారిణి. ఆమె తన మానాన్ని తానుండగా, లోకులే ఆమెవల్ల ఉపదేశం పొంద దలచి, మఠం ఒకటి కట్టించారు. అందులో ఆమెనే ప్రత్యక్షదేవతగా ప్రతిష్ఠించారు. పండిపోయి అడపలుగట్టిన శిరోజాలు ఆమె యొక్క ముదిమిని చెప్పకే చెపుతున్నాయి. కాషాయివస్త్రాలు ధరించిన ఆమె, ఎర్రని నీటితో గంభీరంగా ప్రవహిస్తూన్న వరద గోదావరిలాగు, అందులో ప్రతిఫలిస్తూ, నీటిని మరింత ఎరుపుగా చేస్తూన్న సాయం కాలపు వృద్ధసూర్యునిలాగు ఉంది. పార్వ తమ్మ ఆమెని తరుచుగా దర్శించి తన సందేహాలు తీర్చుకొంటూంది. ఇంటివద్ద గ్రంథపఠనం చేసుకొంటూ, భక్తి ధ్యానా దులతో కాలక్షేపం చేస్తూంది. అప్పటి వరకు తనకున్న అజ్ఞానాన్ని తలచుకొని ఆమె పరితాపపడుతూంది. సాధువమ్మని దర్శించినప్పుడల్లా తనలో వెలుగు ప్రజ్వ రిల్లుతూన్నట్టు, చీకటి పటాపంచ లవుతూ న్నట్టు ఆమె భావిస్తూంది.

ఆదివారంనాటి పొద్దున్న పాపారాయ సీతామనోహరులు పార్వతమ్మ ఇంటికి దయ చేశారు. ఓరగా వేసి ఉన్న తలుపుని తోసి లోపలికి తొంగి చూశాడు పాపారావు. పార్వతమ్మ భగవంతుణ్ణి ధ్యానంచేసు కొంటూ, తలుపు చప్పుడు కాగా కళ్లు తెరి చింది. స్నేహితు లిద్దరూ ఇంటిలోకి అడుగు పెట్టారు. ఆమె చిరునవ్వుతో ఆహ్వానిం చింది. ఇద్దరికీ చెరో కుర్చీవేసి కూర్చో మని కోరింది. ఆమెనికూడ ఒక కుర్చీమీద కూర్చోమని వాళ్లు అడిగారు. కాని ఆమె "అలాగే" అని వేసి ఊరుకొంది. కాఫీనీళ్లు పెట్టడానికి తొందరపడుతూంది. కాని పాపారావు అడ్డ వచ్చాడు.

సీతామనోహరుడు "వద్దు, అమ్మాయీ! వద్దు" అన్నాడు.

వాళ్లు వ్యవహారంమీద వచ్చారు. చెయ్యి తీరకగా ఉండదుకదా అని ఆమెకూడా ఊరుకొంది.

"వీరేమా మిత్రులు, గొప్ప సంఘసంస్క ర్తలు, సీతామనోహరుడుగారు." అన్నాడు పాపారావు.

"ఆయన్ని గురించి ఇదివరకే కొంత విన్నాను. చాలా సంతోషం! వీరి నేనా నువ్వు తీసుకువస్తానని చెప్పుతూ వచ్చావు?' అని అడగ్గా పాపారావు 'ఔను!' అన్నాడు.

సీతామనోహరుడు "అమ్మాయీ! మేము ఇక్కడ అట్టేసేపు కూర్చోము. అవతల అర్జంటు పని ఉంది" అన్నాడు.

"వారికి క్షణం తీరిక ఉండదు" అని పాపారావు బలపరిచాడు.

"తీరుబాటు లేకుండానే జీవితం గడ పాలి. కాని చేసేపని సత్కర్మ అయుం డాలి" అంది పార్వతమ్మ.

"సత్కర్మో! దుష్కర్మో! కర్మ ఎల్ల కాలం ఒక్కలాగుంటుందా?" అన్నాడు సంఘసంస్కర్త.

"ఏ వేనా కొన్ని కొన్ని దురాచారాలు సంఘంలో కాని, మతంలో కాని ప్రబలగా, వాటిని నిర్మూలించడానికే మహానుభావులు ఉదయిస్తారు" అంది ఆమె.

"ఔను!" అన్నాడు పాపారావు.

"సంఘసంస్కరణ అత్యవసరం" అన్నాడు మిత్రుడు.

"అటువంటి మహానుభావులే శంకరుల వారు. మొత్తంమీద ఆచార్యత్రయం" అంది ఆమె.

"సంఘసంస్కరణ ప్రాచీనంలో కంటె నవీనంలో అవృద్ధి పొందింది. రామమో హనరాయలు, ఈశ్వరచంద్ర విద్యాసాగ రుడు, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, మనదేశంలో వీరేశలింగంగారు గాంధిమహాత్ముడు" అన్నాడు సీతామనో హరుడు.

"వారివారికి భగవంతు డిచ్చిన బుద్ధిని సద్వినియోగం చెయ్యడానికి ప్రయత్నం చెయ్యడమే అందులోని ప్రధాన లక్షణం. కాని అందరికీ సమానమైన ఉదాత్తబుద్ధి ఎక్కడ ఉంటుంది! గొప్పవారిలో మళ్ళీ ఎన్ని తరగతులు లేవు!" అంది.

పాపారావు వింటున్నాడు. జయంకోసం ఎదురుచూస్తున్నాడు.

తనని ఒక ఊపు ఊపి చూస్తున్నట్టుగా కనపడింది సీతామనోహరుడికి. "అయితే వీరేశలింగంగారినిగురించి మీ అభిప్రాయ మేమిటి?" అని ప్రశ్నించాడు.

"ఈశ్వరచంద్రుని అడుగుజాడలలో నడి చిన ఒక సామాన్య సంఘసంస్కర్త. పండి తుడనే విషయం తెలుస్తూనే ఉంది. అధి కంగా త్యాగి."

"ఇంతేనా ఆయననిగురించి మీ అభి ప్రాయం" అని ఆశ్చర్యపోయాడు సంఘ సంస్కర్త.

ఆమెభావం తమకి వ్యతిరేకంగా ఉందని

(22-వ పేజీ చూడండి)

# గతుకుల దా

(15-వ పేజీ తరువాయి)

తోచగా పాపారావుకి, ఆమె అందమైన నేత్రాలు చీపికళ్లలాగు కనపడ్డాయి.

పార్వతమ్మ "ఆయన ఆశించిన వితంతు వివాహసంస్కరణకూడ దేశంలో వ్యాప్తి పొందలేదు. ఏదో ఆచార వ్యవహారాల సంస్కరణతో ఊరుకొంటే బాగుండును. కాని ఆయన సంఘసంస్కరణకీ మతసంస్కరణకీ భేదం కనిపెట్టలేకపోయాడు. ఆ కారణంవల్ల సంఘసంస్కరణ అని తలపోసి మతవిషయాలలో జోక్యం కలిగించుకొన్నాడు. దేవతలని, పండుగలని, వ్రతాలనికూడ విమర్శించడం మొదలుపెట్టాడు. మొత్తంమీద హిందూ మతంయొక్క ఔన్నత్యం గ్రహించలేకపోయాడనే చెప్పాలి. ఈ మతంయొక్క ఘనత అంత సులభంగా బోధపడేది కాదు. నేటి వైజ్ఞానికశాస్త్రిలలోని నూతనపరిశోధనలన్నీ పామరజనులకి సులువుగా ఎల్లాగు బోధపడవో అదేమాస్తరుగా హిందూమతం యొక్క పరిపూర్ణసూత్రాలుకూడ పైపై దృష్టికి సులువుగా తెలియవు. ఇటువంటి కారణాలనుబట్టి ఆయన మతవిషయంలో వెనుకంజవేసి పక్కదారులు పట్టించాడు. చివరికి బ్రహ్మసమాజమతమంటూ స్వీకరించాడు. అది తెలుగుదేశంలో ఎంతమందికి కావాలి? మొత్తంమీద ఆయనికి మనమతం లోపభూయిష్టంగా కనపడింది. హిందూ మతంయొక్క ఘనత పూర్తిగా ఎరిగినవాడు గాంధిమహాత్ముడు. వీరేశలింగంగారు ఆచార వ్యవహారాదులలో విమర్శదృష్టి కలిగించిన మాట వాస్తవమే కాని దానివల్ల లాభంకంటే నష్టమే అధికంగా ఉంది. ఆయన, చదువుకొన్నవారికి తప్పు ఒరవడి ఏర్పరిచాడు" అంది.

అంతవరకు అతనికి వీరేశలింగంగారిని గురించి ఉన్న అభిప్రాయాన్ని నిర్దాక్షిణ్యంగా ఖండించివేస్తూన్నట్లు కనపడగా, తాను ఆలోచించి ఆమె అభిప్రాయంతో ఏకీభవించడానికి తగినంత అవకాశం లేకపోగా, పైగా తటాలున పూర్వాభిప్రాయాన్ని విడనాడలేక, ఆమెకి వీరేశలింగంగారినిగురించి ఉన్న అజ్ఞానానికి చాల విచారించాడు. సీతామనోహరుడు ఈలాగు భిన్నాభిప్రాయాల మధ్య కవ్వం తిరిగినట్లు తిరుగుతున్నాడు. వాదించడానికేమీ తోచలేదు. మొత్తంమీద ఏదో కొంత జ్ఞానోదయమైనట్లు కనపడగా "అయితే మన మతం నిజంగా ఘనమైనదే అంటారా?" అన్నాడు అమాయకంగా.

అభిప్రాయభేదాలు కలిగేయని తెలుసుకోగా పాపారావుకి, అర్ధచంద్రునిలాంటి ఆమె లలాటం బూడిదగుమ్మడికాయ చెక్కలాగు కనబడింది.

పార్వతమ్మ: "ఒక చిన్న సంగతి చెప్తాను వినండి. ఈ కాలంలో మనవాళ్లకి ప్రతి విషయానికీ పాశ్చాత్యుల కొలబద్ద కావాలి. మన పూర్వవైభవాన్నిగురించీ, మన సంస్కృతియొక్క ప్రశస్తినిగురించీ, పాశ్చాత్యుల ప్రశంసాపత్రాలు చూసి మనలని మనం మెచ్చుకోగలుగుతున్నాం! మనమెంతటి అధోగతికి వచ్చాం! మన ఆత్మజ్ఞానం ఎంతగా నశించిందో కనిపెట్టండి? అశాంతితోను, ఆంతరంగిక కల్లోలాలతోను అలమటించిపోయే నేటి ప్రపంచానికి ఎప్పటికైనా శాంతి సౌఖ్యాలు ఆధ్యాత్మికౌన్నత్యం పొందిన భారతదేశం నుంచే వస్తాయని పాశ్చాత్యదేశాలు ప్రతీక్షిస్తున్నాయి. దానినిబట్టైనా మీరు మన మతాధిక్యతను గ్రహించండి" అంది ఆమె గంభీరంగా.

సీతామనోహరుడు విన్నాడు. కాని ఏమీ పాలుపోలేదు. గది నాలుగుదిక్కులా చూశాడు. చివరికి "వీరేశలింగం అంటే మీకు చాలా కోపమన్నమాట!" అన్నాడు స్థూలపరిశీలనగా.

పార్వతమ్మ: స్నానం చేసి తలవెంట్రుకలు చివర ముడివేసుకొనగా ఆమె తలవెంట్రుకలు పాపారావుకళ్లకి తలకిందుగా ఉన్న పట్టి సవరంలాగు కనపడ్డాయి.

పార్వతమ్మ "ఛీ! ఛీ! మీరు ఎప్పుడూ ఆలాగు భావించవద్దు. అది పట్టి అజ్ఞానం. ఆ పెద్దమనిషి పాపం శ్రమ పడ్డాడు, త్యాగంచేశాడు. ఆయననమ్మినదిబోధించి, ఆచరించాడు. ఆయన నిష్కల్మషంగానే పాటుపడ్డాడు. అందుచేత ఆయన్ని అనడానికేమీ లేదు. కాని ఆయనచెప్పినవాటిని గుడ్డిగా నమ్మి, మంచి యేది, చెడ్డ యేది అని ఆలోచించకుండా అనుసరించిన మనుష్యులయొక్క అజ్ఞానాన్ని నేను విమర్శించడం. మన వివేకం ఎక్కడికి పోయింది? మన సత్సంప్రదాయం ఏ ఏటిలో కలిసింది? మన సంస్కృతి ఏదరికి చేరింది? అని నేనడగడం. ఇదీ నేను తప్పుపట్టడం. లోకంలో అనేకమంది తాము త్రికరణశుద్ధిగా నమ్మిన వాటిని ప్రకటిస్తారు, ప్రచారంచేస్తారు. అది మనుష్యుని జన్మహక్కు. కాని వాటియొక్క నిజానిజాలు, మంచిచెడ్డలు, న్యాయాన్యాయాలు తెలుసుకోకుండా గ్రహిస్తే ప్రజలు పాడైపోతారు. ప్రజారాజ్యమంటే ప్రజలలో ఎంత బాధ్యత ఉందో చూడండి. ఒక్క మతవిషయకమే గాదు. వైజ్ఞానికంగా అయినా కూడా అదే అనుకోండి" అంది చిరునవ్వు నవ్వుతూ.

ఆమెచిరునవ్వు అదో వికారంగా కనబడింది పాపారావుకి.

[ఇంకావుంది.]

---

అమెరికన్ హాస్యరచయిత మార్క్ ట్వేన్ ఒకసారి తన పొరుగున ఉండే ఒక ఆసామీ ఇంటికి వెళ్లి ఫలానా పుస్తకమేదో కావాలని, చదివి యిచ్చేస్తాననీ, కోరాడు.

"ఇవ్వటాని కభ్యంతర మేమీలేదు. కాని మీరు ఇక్కడే కూర్చుని చదువుకోవాలి. నా పుస్తకాల్ని నా లైబ్రరీగది దాటి వెళ్ళనివ్వకూడదని నాకో నియమం ఉంది." అన్నాడా ఆసామి.

కొన్నాళ్ళ తర్వాత ఆ ఆసామీ మార్క్ ట్వేన్ యింటికి వచ్చి గడ్డపార ఒకసారి ఇమ్మని కోరాడు.

"అలాగే యిస్తాను. కాని ఆ గడ్డపారని మీరు నాదొడ్లోనే ఉపయోగించాలి. అలాగని నియమం పెట్టుకున్నాను." అన్నాడు మార్క్ ట్వేన్.

పెద్దకథ :

# గతుకుల దారి

టేకుమళ్ల కామేశ్వరరావు

## 3

ఆమె చెప్పింది జాగ్రత్తగా విన్నాడు సీతామనోహరుడు. అతనికి ఉపన్యాసాలలో సామాన్యంగా అనుభవానికి వస్తూన్న ఒక విషయం స్ఫురణకి వచ్చింది. "నేను కూడా ఒక చిన్న సంగతి చెప్పతాను వింటారా? ఒక పెద్దమనిషి బల్లగుద్ది ఏది గట్టిగా చెప్పితేఅది నమ్ముతారు ప్రజలు" అన్నాడు.

"నేను ప్రజలు అనడంలో విద్యావిహీనులైనవారిని అందులో చేర్చడం లేదు. ప్రజానాయకులని, విచక్షణాపరులైన మనుష్యులని వీరినే ముఖ్యంగా ప్రజలని పరిగణిస్తున్నాను" అంది.

"అయితే వీరేశలింగంగారు చెప్పినట్లల్లా ప్రజలు ప్రవర్తించేరనే మీ అభిప్రాయమా?" అన్నాడు సంఘసంస్కర్త.

"అబ్బే! అదేంతమాత్రము కాదు. ఒక మనిషిగొంతుక ఎంత గట్టిగా చించుకొన్నా ప్రజలు వింటారుగాని తటాలున మనస్సుకి పట్టించుకోరు. దానివల్ల మంచికి మంచీ ఉంది, చెడ్డకి చెడ్డా ఉంది. మంచిది వెంటనే గ్రహించి ఆచరించకపోడంవల్ల నష్టం లేదా? చెడ్డది వెంటనే ఆచరించకపోడం లాభమే అనుకోండి. అది అలాగు ఉంచండి. దానికి మళ్లీ కారణమేమిటంటే ఒక కొత్తభావం అదివరకున్న భావాలతో సర్దుకోకుండా మనిషి సర్వసామాన్యంగా ఆచరించడు. అందుచేత ప్రతివిషయం కొంతకాలం తీసుకోక తప్పదు. అది మనుష్యస్వభావం" అంది.

దానికి తానే నిదర్శనమని సీతామనోహరుడు మనస్సులో భావించుకొన్నాడు.

ఒక పెద్ద జడివాన కురిసి వెలిసినట్లుగా పాపారావు తలపోశాడు. జయంకోసం ఆగుర్దాపడుతున్నాడు.

సీతామనోహరుడు "ఇది మనస్సులో జీర్ణమవడానికి కొంత వేళ కావాలి, కాబట్టి దీనినిగురించి వాదన మనకి వద్దు. ప్రస్తుతం ముఖ్యమైన అంశాన్ని తెలుసుకొందా" మని ఆలోచించి, పైకి "వితంతువివాహాలని గురించి మీ అభిప్రాయ మేమిటి?" అని సూటిగా ప్రశ్నించాడు.

ఇంతసేపటికి మనకి సంబంధించిన ప్రశ్న వచ్చిందికదా అని పాపారావు ఒక దీర్ఘ నిశ్వాసం తీశాడు. నోరుతెరుచుకు కూర్చున్నాడు.

పార్వతమ్మ "లోకంలో ఆ సంస్కరణ బహుమతమైనది. వీరేశలింగంగారి కాలంలో బాల్యవివాహ దురాచారకారణంగా బాలవితంతువులు అధికంగా ఉండేవారు. కాబట్టి అప్పటిలో ఆ సంస్కరణకి కొంత అవకాశం కలిగింది. ఇప్పుడు ప్రభుత్వశాసనంవల్ల బాల్యవివాహాలు ఇంచుమించుగా రూపుమాశాయి. కాని వయస్సు వచ్చిన, వయస్సు మీరిన వితంతువులు ఎప్పుడూ ఉండనేఉంటారు. లోకంలో అట్టివారిలో ఇష్టపడినవారు సాహసించి వివాహం చేసుకోవచ్చు. కాని అది తప్పనిసరి అని భావించే సంస్కర్తవట్టి మూర్ఖుడు," అంది.

తన మిత్రుడు ప్రశ్న వెయ్యడం, జవాబుగా పార్వతమ్మ ఉపన్యసించడం చూడగా పాపారావుకి తాను ఎదురుచూస్తూన్న విజయం సందేహాస్పదంగా కనపడింది.

"అలాగు అనకండి! అది చాల అవసరం" అని సంఘసంస్కర్త తన స్థిరాభిప్రాయం వెలువరించాడు.

పార్వతమ్మ "పిడుగుకి, బియ్యానికి ఒకటే మంత్రం పనికిరాదు. ఇప్పుడు మీ తల్లి గారి సంగతే తీసుకొందాం. ఆమె వితంతువు కదా! ఆమెకి మీరు తిరిగి వివాహం ఎప్పుడు చేస్తారు?" అని గడుసుతనంగా ప్రశ్నించింది.

"ఛ! ఛ! అదేమన్నమాట!" అన్నాడు సంఘసంస్కర్త అసహ్యంతో.

"చూశారా మరి! వీరేశలింగంగారి కాలంనాటి స్థితిగతులు మనం విచారించాలి. అప్పటి విదేశప్రభుత్వం, ప్రజల విద్యావిహీనత, స్వమతప్రశస్తి ఎరుగకపోడం, ఇటువంటి అనేక కారణాలవల్ల వీరేశలింగంగారు పూనుకొన్న సంస్కరణ గొప్పదిగా కనపడ్డదికాని అది నిజంగా చిన్నదైన సంస్కరణ. దానిని గాంధిమహాత్ముడు సరియైన ఉరవులో పరిగణించాడు" అంది ఆమె.

సీతామనోహరుడు సంఘసంస్కరణలో ఉండే కష్టసుఖాలు ఎరిగినవాడు కాబట్టి "సంఘంలో ఉన్న ఒక లోపం ఎరిగినంత మాత్రాన ప్రజలు సాహసించి, సంఘాన్ని ఎదిరించి, ఆచరించగలరా? ఆ పనికి ఒక మహానుభావుడు అవసరం కాదా? దేశానికి స్వాతంత్ర్యం లేదని మన దేశప్రజలు ఎరుగుదురు. అంతమాత్రంచేత ప్రజలు స్వరాజ్యాన్ని సాధించగలిగారా? దానికి గాంధీ మహాత్ముడు అవతరించి దారి చూపించవలసివచ్చింది కాదా? అలాగే వీరేశలింగంగారు కూడ సంఘసంస్కరణానికి దారి చూపించాడు" అన్నాడు సీతామనోహరుడు.

"ఒక వ్యక్తి ఏదో నాలుగు తన చేతితో చేసినంతమాత్రాన పని పూర్తిగా అయిపోదు. నాలుగు డబ్బులు డబ్బీలో వేసి దానికి 'లోకనిధి' అని పేరుపెట్టినందువల్ల లాభం లేదు. దేశంలో ఒక పనికి అవసర

మైన ప్రబోధం చెయ్యాలి. ఒక్క వ్యక్తి వల్ల అంత ప్రబోధం జరగదు. పదిమందిని కూడగట్టుకోవాలి, పని చెయ్యాలి. ప్రజలని స్వతంత్రయోచనాపరులుగాను, విద్యావంతులుగాను చెయ్యాలి. ఈరీతిగా తయారుచేస్తే ప్రజలే తమకి అవసరమైన సంస్కరణలు తామే సాధించుకొంటారు. మానవసంఘం సాధారణ జంతుసంఘంలాంటిది కాదు. దీనికి నీతి నియమా లున్నాయి. వ్యక్తికి పూర్తిస్వేచ్ఛ అనేది లేనేలేదు. హక్కులతో పాటు ధర్మా లున్నాయి. ఇంతకీ వీరేశలింగంగారు సంఘంలోని దురాచారాలకి మూలకారణం మతమని భావించాడు. అట్లు తలపోసి ఆయన మతసంస్కరణ ప్రారంభించాడు. అదే ఆయనలోని గొప్ప లోపం. మతం పేరట కొన్ని కొన్ని దురాచారాలు బయలుదేరవచ్చు. కాని, వాటికి మతం కారణం కాదు. ప్రజలు, విద్యావిహీనత, అజ్ఞానం కారణాలు. వీరేశలింగంగారు మతం మూలకారణం అనుకోడంబట్టి సంఘసంస్కరణనుంచి మతసంస్కరణలోకి దూకాడు. హిందూమతం వదిలి, బ్రహ్మసమాజ మతం అన్నాడు. ఈ రకం తప్పుదారి పట్టాడు. మతంలో జోక్యం పెట్టుకొన్నందువల్ల ఆయనసంస్కరణ వృద్ధి పొందలేదు. ఇలాంటి అవకతవకలవల్ల ఆయన నాలుగోతరగతి సంఘసంస్కర్తకాని, మరొకటి కాదని నేను మీకు నచ్చజెప్పడం" అంది.

"మీ అభిప్రాయం చాలా సంకుచితంగా ఉంది." అన్నాడు సీతామనోహరుడు తన వాదన నిలబెట్టుకోడంకోసం.

"అభిప్రాయభేదాల కేమిటి లెండి? దేశంలో అనేకమైన సంస్కరణలు ఎప్పటికప్పుడే అవసర మంటాయి. నేటి రాజకీయశాసనాలు చూడండి. ఇవీ ఒకరకమైన సంస్కరణలే! కాని, అంతమాత్రంచేత వాటిని మతసంస్కరణగా ఎవ్వరూ భావించడం లేదు. సంఘసంస్కరణకూడా అట్టిదే," అంది ఆమె.

"ఇదేదో ఆలోచించి చూడవలసిన విషయం," అని సీతామనోహరుడు గొణుగుకొన్నాడు.

"ఈ సంగతికూడా కొస్త దయచేసి వినండి. శ్రమపడ్డవాళ్లు ఎలాగూ శ్రమపడ్డారు. మిమ్మల్ని శ్రమపెట్టినందుకు నేను చాల విచారిస్తున్నాను," అంది ఆమె.

"అబ్బే! ఎంత మాట! దాని కేముంది! మీరు చెప్పింది వింటాం. దానివల్ల దోషం ఏముంది. గ్రహించడమనేది వేరేసంగతి," అన్నాడు సంఘసంస్కర్త.

పాపారావు కళ్లు అప్పచెప్పి కూర్చున్నాడు. ఇదంతా ఏదో మాయలాగు కనబడుతూంది. ఇందులో అసలుసంగతి ఎక్కడా బయటపడడం లేదు.

ఆమె మళ్లీ "గాంధిమహాత్ముని విషయం చూడండి. ఆయనకూడ వితంతువివాహం అంగీకరించాడు. కాని, అది స్త్రీయొక్క స్వేచ్ఛానిర్ణయానికి విడిచిపెట్టమన్నాడు. అంతేకాని ఇతరులని ఒత్తిడిచేసి చెయ్యమని చెప్పలేదు. దేశంలో నిజమైన సంఘసంస్కరణ గాంధీమహాత్ముడితోనే ప్రారంభ మయింది," అంది ఆమె.

సీతామనోహరుడు ఆశ్చర్యపోయి విన్నాడు. చివరికి తన మిత్రుడు ఏవిషయమై ఇక్కడికి తనని తీసుకువచ్చాడో ఆ విషయం ఇంకా ఎత్తనే లేదన్న సంగతి స్ఫురణకి రాగా, అతను "ప్రకృతం మీమాట ఏమిటి?" అన్నాడు సూక్ష్మంగా.

"నామాట నా ఇచ్ఛ. ఆ భగవంతుడే నాకు సర్వమున్నూ. ఆయనకంటె నాకు కావలసిన ఐహికవాంఛ లేదు," అంది.

సంఘసంస్కర్తకి ఏమీ మాట్లాడడానికి తోచలేదు. "ఎవరి ఇష్టం వారిది. ఎవరి దృష్టి వారిది. మీ స్వేచ్ఛని భంగంచెయ్యడం నా కిష్టంలేదు. కాని, మా మిత్రుని కోరిక మీరు ఎరిగేఉన్నారు. వీలయినంతమట్టుకు నిరాకరించవద్దు," అన్నాడు తాను చెప్పతూన్న దానిలో ఎంతమాత్రం నమ్మకం లేకపోయినా.

ఆ మాటలు విని పాపారావు బ్రహ్మానందపడ్డాడు.

"మీ మిత్రుని వివాహానికి ఆయన తండ్రిగారే తాపత్రయపడుతున్నాడు. గట్టి ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి, ఆయనని గురించి మనం ఎంతమాత్రమూ ఆందోళనపడనక్కరలేదు," అంది పార్వతమ్మ అభయహస్తం ఇచ్చినట్లు.

సీతామనోహరుడు ఆమెని ఆశ్చర్యపడి చూశాడు. ఆమె సంభాషణవల్ల తనకికూడ కనువిప్పయినట్లుగా కనపడింది. ఇంక వాదించవలసిన అవసరం లేదనుకొంటూ


శ్రీ అంబాళ్

ఆఫీసర్స్ నస్యము




1 తులము టిన్నులలో అన్నిచోట్ల దొరకును.

శ్రీ అంబాళ్ అండు కంపెని,

తపాలు పెట్టె నెం. 8. మదరాసు.

అతను లేచి, నమస్కరించి "అమ్మాయీ! వెళ్లివస్తానమ్మా!" అన్నాడు.

పాపారావుకూడా "వెళ్లి వస్తాను," అని నిద్రలోంచి లేచినట్టుగా లేచాడు.

వాళ్లు వెళ్లిపోయారు.

వాళ్లతో వాదించడానికి తన కింత ధైర్యం ఇచ్చినందుకు పార్వతమ్మ భగవంతుణ్ణి, సాధువమ్మనికూడ బహువిధాల స్తుతించింది.

దారిలో వెళుతూండగా పాపారావు సీతామనోహరుడితో "చివరికి ఏమయినట్లు?" అని ప్రశ్నించాడు. సంగతేదో తేల్చుకొందామని.

"మన లెక్కేమీ లేదయ్యా!" అన్నాడు మిత్రుడు.

"అయితే మీరు చేసుకొన్న వివాహాన్ని కూడ త్యణీకరించినట్లేనా?" అన్నాడు పాపారావు.

"లేదు. ఎవరి స్వేచ్ఛానిర్ణయం వారిది అని తేల్చడంవల్ల నాకుకూడా దారి చూపించింది," అన్నాడు సంఘసంస్కర్త.

"మీరు ఒప్పిస్తాను, చేస్తాను, చెందుతాను అన్నారు మరి?" అన్నాడు పాపారావు అమాయకంగా.

"సరి! బాగానే ఉంది. ఆవిడ మనకే చదువుచెప్పుతూంటే, మనం ఆవిడకి బోధించేది ఏమిటయ్యా! మనకన్న ఎక్కువ తెలిసిన ఘటంకాని సామాన్య కాదు. నా కాసంగతి మొదట ఏమి తెలుస్తుంది! దిగితేగాని లోతు, తింటేగాని రుచి తెలియదన్నారు శాస్త్రకారులు," అన్నాడు సీతామనోహరుడు.

"అయితే, నా కేమిటి దారి?" అని మతిపోయినట్లుగా కనపడ్డాడు పాపారావు.

"నీదారికూడా ఆమెనే అడుగు. కాని ఆమెదగ్గిర వెర్రివేషాలుమట్టుకు వెయ్యద్దు!" అని సలహా ఇచ్చాడు మిత్రుడు.

"అలాగే!" అన్నాడు పాపారావు.

ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు.

ఆ మర్నాడు పాపారావు పార్వతమ్మ ఇంటికి తిరిగి వెళ్లాడు. ఆమె పను లేవో చేసుకొంటూ, అతన్ని చూసి చిరునవ్వు నవ్వుతూ కుర్చీమీద కూర్చోమంది. వెళ్లి కాఫీకి నీళ్లు కుంపటిమీద పడవేసింది.

పాపారావు యోచనానిమగ్నుడై ఉన్నాడు. మధ్యమధ్య అతని దృష్టి ఆమెవైపు అందని పండుని చూసినట్టు చూస్తూంది. ఒకవైపు ఆశ్చర్యం, ఒకవైపు ఆకర్షణం, మరొకవైపు విచారం ఇన్ని భావాల మధ్య సుడిగుండంలో పడ్డట్టుకొట్టుకొంటున్నాడు; పార్వతమ్మచర్యలవైపు చూస్తున్నాడు.

"ఏమిటి విశేషాలు?" అంటూ పార్వతమ్మ సంభాషణ కదిపింది.

ఆమె తలకి నూనె రాసుకొని, వాలుగా తల వంచి, పన్నితో దువ్వుకొంటూండగా, ఆమె మనోహరాకారాన్ని అతను చూసి ఆనందిస్తూ, "నీవ్రతం ఆఖరయిందా ఏమిటి?" అని కొంటెప్రశ్న వేశాడు.

"ఏమి వ్రతం?" అని నవ్వింది.

"తల చింపిరిగా పెట్టుకోడం, నూనె రాసి తలదువ్వుకొని జడ వేసుకోకపోడం. చేతినుండి వెండిగాజులు తీసివెయ్యడం, కాషాయవస్త్రాలు దాల్చడం ఇత్యాది వికారలక్షణాలుగల దుష్టవ్రతం," అన్నాడు పాపారావు పూర్తి అక్కసుతో.

ఆమె ముత్యాలు ఒలికేటట్లు నవ్వి "నేను నీతో చెప్పేనా వ్రతంచేస్తున్నానని?" అంది.

"దొంగవాడు దొంగతనం చేస్తున్నానని చెప్తాడూ! వాడి వాలకం చూసి మనమే గ్రహించాలిగాని."

"నువ్వు నిజంగా తెలివైనవాడివే గాని, బుద్ధి మధ్యమధ్య అడ్డదోవలు పట్టిస్తూ ఉంటుంది," అంది ఆమె జడ అల్లుకొంటూ.

"అయితే నేను అన్నమాట నిజమేనంటావా?"

"నిజమే నని నేను చెప్పేనా?"

"ఏదయితేయేం మా స్నేహితుణ్ణి కూడ హంసలగొట్టేశావు. నీవేషమూ, నువ్వునూ!"

"నా కేం తెలుసు, అదంతా సాధువమ్మ ప్రజ్ఞ. జ్ఞాననేత్రం తెరిపించినందుకు ఆమెకి రెండుచేతులూ ఎత్తి మొక్కాలి," అని రెండుచేతులూ ఎత్తి మొక్కింది.

"నేనుకూడా మొక్కుతాను," అంటూ అనుసరించాడు. "సరేకాని నామాట ఏం చెప్పావు?" అని ప్రశ్నించాడు.

"ఏం మాట?"

"ఏం మాటా! నేను ఇలా చివికి చావవలసిందేనా?"

"నీ కేం రాచబిడ్డడివి! కో అంటే కోటిమంది, చక్కని రత్నాలగనిలాంటి పిల్లని తెచ్చుకొంటావు; సుఖపడతావు!" అంది ఆమె ఉత్సాహంగా.

"నువ్వే మెచ్చుకోవలసిందే నా బతుకుని," అని విచారంగా కనపడ్డాడు.

"ఎన్నడూ అలాగు నిరుత్సాహపడవద్దు" అని ఆమె ధైర్యం చెప్పింది.

"ఆ విషయంలో నువ్వు కలుగచేసుకొంటేనే నేను ఈ మనుష్యులమధ్య మెలగడం. లేకపోతే ఏ ఆశ్రమమో—"

అతని మాటలకి పార్వతమ్మ అడ్డువచ్చి, "ఛీ! ఛీ! అటువంటి అవాచకాలు రానియ్యకు. శుభ్రపదంగా జీవించక నీ కేమి లోటోయి! నీ వయస్సుకి, నీ మనఃస్థితికి ఆశ్రమా లేమిటి! నువ్వు ఒకవేళ చేరినా ఆ మర్నాడే మళ్లీ ఇంటికి పరుగెత్తుకొని చక్కావస్తావు. అనుభవం గలిగి, వైరాగ్యం పుట్టినవాళ్లకి ఆశ్రమాలు, యోగాభ్యాసాలు కాని నీవంటివాళ్లకా! అయ్యో!" అంది.

ఆమె అతని చేతికి కాఫీకప్పు అందించగా అతను రుచి చూస్తూ "అంటే నీవంటివాళ్లకి మాత్రమే! ఏమంటావు?" అని వెటకారంగా అన్నాడు.

"నావంటివాళ్లకి అన్నమాట యథార్థమే. మంచో, చెడ్డో ఒకమాటు జరిగిపోయిన నాకు కాకపోతే మరెవరికి! నీ లేత వయస్సుకిమాత్రం అటువంటి ఆలోచనలు తగవు," అంది.

ఇంతలో ఎవరో పనిమీద ఇంటిలోకి వచ్చారు. పైగా పాపారావు "జరూరుపని ఒకచోట ఉంది. దాని మాటే మరిచిపోయాను," అంటూ లేచి గబగబా పరుగెత్తాడు.

నాలుగునాళ్లయింది. పేరయ్య సంబంధం ఒకటి పాపారావుకి చూసుకొని వచ్చాడు. ఆ పిల్లతండ్రి పెద్ద వకీలు. పిల్ల బాగా చదువుకొంది. పదహారేళ్లుంటాయి. కట్నం కానుకలలో ఎట్టి లోపమూ లేదు. పైగా అందకత్తె. ఈ సంబంధంగురించి తహసీల్దారుగారికి తెలుపగా ఆయన చాల సంతోషించాడు. ఈమధ్య వచ్చిన అభాండాలు తలపోసి, కుమారుడియొక్క ఇష్టాయిష్టాలుఅడగకుండానే పెళ్లి చేద్దామనుకొన్నాడు. కాని ఈ కాలపు ఆచారాన్ని మాటవరసకేనా అనుసరిద్దామని తలచి పిల్లని పాపారావుకి చూపించ నిశ్చయించుకొన్నాడు.

కిందటిమాటు ఎక్కువసేపు కూర్చుని పార్వతమ్మతో కబుర్లు చెప్పుకోకపోవడంచేత పాపారావు ఏరోజు కారోజే ఆ అమ్మాయిఇంటికి ప్రయాణంకడుతున్నాడు. కాని, ఏదో అభ్యంతరం వస్తూనేఉంది. ఈరోజున వెళ్లక తప్పదనుకొని బయలుదేరాడు. పార్వతమ్మ ఇంటిలోనే ఉండగా సంతోషించాడు. అతన్ని చూసి పార్వతమ్మ సంతోషించి, "దర్శనాలే అరుదయ్యేయేమి?" అంది.

"ఎప్పుడూ తలచుకొంటూండబట్టి అసలే ఎనకపడింది," అన్నాడు.

(37-వ పేజీ చూడండి)

వున్నప్పుడు నన్నొకసారి గుర్రం కొరడాతో కొట్టించాడు. ఎక్కడనుకున్నావ్? జైలు ముందు, అందరి ఎదుటా. కొరడాతో కొట్టించాడు! వింటున్నావా? అర్థమైందా నే చెప్పేది? కొరడాతో కొట్టించాడు! నేను "పగ" తీర్చుకోకుండానే చచ్చాడు. ఇప్పుడతని భార్య 'మీద నా పాత పగ సాధించకుండా వదలి పెడతానా?

"వద్దు జో! ఆమెని చంపవద్దు."

"చంపటమా? చంపుతా నని ఎవరన్నారు? అతనైతే చంపేసేవాణ్ణి. ఆమెని చంపను. ఆడదాని మీద పగతీర్చుకోవాలంటే చంపకూడదు. ముక్కులు, చెవులు కత్తిరించాలి."

"జో! చాలా ఘోరం అది...

"నోరు ముయ్. నీ సలహా నాకక్కర్లేదు. ఆమెను మంచానికి కట్టేస్తాను. చస్తే చావనీ. నువ్వు నాకు ఈ పనిలో తోడుపడాలి. అందుకే నిన్నిక్కడికి తీసుకొచ్చాను. నా కొక్కడికీ యీ పని కుదరదు. నువ్వు గనక కదిలావంటే చంపేస్తాను. నిన్ను చంపితే దాన్నికూడా చంపాల్సివస్తుంది. ఇక తరవాత ఈ హత్యలు, చేసినవాణ్ణి కనుక్కోవటానికి భూమి తలకిందులు కావలసిందే! హుం!"

"సరే! చేసి తీరాలంటే నా అభ్యంతరం ఏమీ లేదు. కానియ్. ఎంతదబ్బున చేసేస్తే అంతమంచిది."

"ఇప్పుడా? అక్కడ లైట్లు ఉండగానా? నీమీద నాకు అనుమానం కలుగుతోంది. జాగ్రత్త! హే!...తొందరలేదు. దీపాలారనీ."

తరవాత నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం వాళ్ళ మాటలకంటే భయంకరంగా వుంది. హాక్ ఊపిరి బిగపట్టి వెనక్కి అడుగు వేశాడు. మరొక అడుగు వేశాడు. కాలికింద ఎండిన పుల్ల ఒకటి విరిగిన చప్పుడైంది. హాక్ కి ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. విన్నాడు; అలికిడి ఏమీ లేదు అంటే వాళ్లు కదల్లేదన్నమాట. నెమ్మదిగా పొదల ఇవతలకి వచ్చాడు. ఇంకొకటి చిన్న కేంద కొన్ని చేరుకున్నాడు. ఇక భయం లేదనుకున్నాడు. రివ్వున బాణం లాగా పరుగెత్తాడు కొండకిందకి. వేల్సుదేశస్థుడి ఇంటిముందుకి వచ్చే వరకూ దోవలో ఎక్కడా ఆగకుండా పరిగెత్తాడు.

## గతః కుల దారి

(15-వ పేజీ తరువాయి)

"అయితే తలపులో నేనా ఉన్నామే!" అంది.

"అసలు ఉండేదే తలపులో!"

"మాబోటివాళ్లమీద ఆమాత్రం దయ ఉన్నా చాలు."

"నీకుమాత్రం పిసరంతేనా దయ లేదు. నేనే వెయ్యివిధాల నయం! ఏమంటావు?"

"నీభావంమాత్రమే అది. నిజం కాదు!"

"ఉట్టిమాటలకేం గాని నువ్వు నాకు ఏం ఉపకారంచేస్తావో చెప్పదూ? ఇంతకీ నాకు కావలసింది అది" అని స్పష్టంగా అడిగాడు.

"నువ్వు ఏం చెయ్యమంటే ఆ పని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను."

"మా నాన్న మళ్లీ ఒక పిల్లని చూడమని పోరు పెడుతున్నాడు. ఏలాగు చావడం!" అని విసుక్కొన్నాడు.

"వెంటనే చూడమని నా సలహా" అంది.

"ఒకరూపం నా కళ్లఎదుట కట్టి ఉండగా నేను మరొక వస్తువులో ఏమి సౌందర్యం చూడగల" నని తల చేతితో పట్టుకొన్నాడు.

"అదే కనబడుతుంది, ఒక పిసరు బుద్ధి తెచ్చుకొంటే!" అంది.

"నేను గుణాగుణాలు పరిశీలించలేను" అన్నాడు వెనకటి భావం పూర్తిచేస్తూ.

"అయితే నన్నేమి చెయ్యమని ఆజ్ఞ!"

"నువ్వు వెళ్లి చూసిరా. నీకు నచ్చితే నాకు నచ్చినట్టే!"

"ఓ! అదెంతసేపు! నిమిషాలమీద!" అంది పార్వతమ్మ చిటికెలు వేస్తూ.

"పెళ్లి అంతా నువ్వే దగ్గిర ఉండి చేయించాలిసుమా. అదే మొదటి షరతు!"

"ఓ! దివ్యంగా! కావలసినవన్ని పాటలు పాడతాను. పాన్పుమీద పాటలు కూడా పాడతాను. కావలిస్తే అడపకుంచుముడికూడా ఒకటి వయ్యమంటే వేస్తాను" అంది సంతోషంతో.

పాపారావుకంటినుంచి రెండు వెచ్చని కన్నీటిచుక్కలు రాలాయి. అతను దుఃఖాన్ని దిగమింగాడు.

"వెర్రివాడా! గతాన్ని మరిచిపో! ఇది అజ్ఞానప్రపంచం! సంసారమే అటువంటిది! దగ్గిర ఉన్న సౌఖ్యమే కాని దూరంలో వున్న బాధలని గుర్తించలేదీ మనస్సు. ఎదుట ఉన్న ఎరని మింగుదామనే ఆత్రపడుతుంది కాని బోనులో పడి చస్తామని భావించదు జీవి. ప్రపంచదృష్టికి తాత్వికదృష్టికి అంత తేడా ఉంది బాబూ!" అంది

"నీకు సాధువమ్మ గురువయితే, నాకు నువ్వు గురువు!" అన్నాడు పాపారావు.

"సరే! నువ్వే నన్ను మెచ్చుకోవాలి. ఆమె జ్ఞానోపదేశం లేశమంతే చేసిన మాత్రాన్నే కలిగిన వివేక మిది. ఆమె యొక్క పరిపూర్ణజ్ఞానం సామాన్యమానవులకి పొందడానికి సాధ్యమా!"

పాపారావు లేచి నమస్కరించి "వెళుతాను" అన్నాడు.

"నాకా నువ్వు నమస్కారం చెయ్యడం! బాగు బాగు," అంది.

"ఎంతో తెలిసిన మా స్నేహితుడే నీతో మారు మాటాడలేక నమస్కరించాడు. ఇంక నామాట చెప్పాలా! అయ్యో!" అని మళ్లీ నమస్కరించి వెళ్లిపోయాడు. *

మళ్లీ సాయంత్రమే పాపారావు పార్వతమ్మ ఇంటికి కొట్టుకువచ్చాడు.

"ఇదేమిటి అప్పుడే వచ్చావు!" అని ఆమె ఆశ్చర్యపోయింది.

"ఇవాళే వెళ్లి నన్ను పిల్లని చూసుకొని రమ్మని మా అమ్మ, నాన్న ఒత్తిడిచేస్తున్నారు. పేరయ్య తోడువస్తారు. నిన్ను కూడా నాతో తీసుకొని వెళతానని మా ఇంటిలోవాళ్లకి చెప్పాను. మీ అమ్మకి కూడా చెప్పాను. అంతా ఒప్పుకొన్నారు. మరి బయలుదేరు రా. మరి మా ఇంటికి రా"! అని పసివాడిలాగు తొందరపడ్డాడు.

పార్వతమ్మ ముస్తాబయి, బయలుదేరగా, ఆమె చేతిలో సంచి పాపారావు తీసుకుని దారితీశాడు. [అయిపోయింది]★